
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
3
శనివారం 15 మార్చి 2025





భక్తుల కోసం సిద్ధం చేసిన గ్యాలరీలు



భక్తులకు అందించటానికి పసుపు, కుంకుమ, పసుపు, దారం ప్యాకెట్‌లను సిద్ధం చేస్తున్న సేవకులు

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

శ్రీవారి కల్యాణోత్సవానికి అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు.



హోలీ.. ఆనందాల కేళి

రంగుల పండుగ హోలీ.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఆడిపాడారు.
- గుంటూరు(తూర్పు)

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

సమస్యల వలయంలో టిడ్కోలు



పిచ్చిమొక్కలతో నిండి ఉన్న తెనాలిలో టిడ్కో గృహ సముదాయం

- నివాసానికి ఇష్టపడని లబ్ధిదారులు
- వసతుల కల్పనపై అధికారులు మీనమేషాలు
- తాగునీటికి కటకట..డ్రెయినేజీ అధ్వానం.. అపరిశుభ్రత
- నాడు హడావుడి గృహ ప్రవేశాలు.. నేడుపట్టించుకోని పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎనిమిదేళ్లకుపైగా నిరీక్షణకు తెరపడి ఇళ్లల్లో చేరినా.. ఆ ఆనందం ఆవిరైపోతోంది. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించగా వైసీపీ వాటిని పాడుపెట్టి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల చేత హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. అయితే కనీస సౌకర్యాలు సమకూర్చకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం నాటి పాలకులు లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వగా ప్రస్తుతం వాటి పరిష్కారంపై పాల కులు దృష్టి సారించడంలేదు. తాగు నీటి, డ్రెయినేజ, అపరిశుభ్రత, విద్యుత్, రవా ణా తదితర సమస్యల్లో టిడ్కోప్రాంగ ణాలు నిండిపోయాయి. వందల సంఖ్యలో గృహస్తులు ఉంటున్నా తాగునీరు అంతంత మాత్రంగా సరఫరా చేస్తు న్నారు. దీంతో తాగునీటితో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని చోట్ల అయితే సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో ఉండేందుకు ముందుకు రావడం లేదు. టిడ్కో ఇళ్లల్లో లబ్ధిదారులు ఎందుకు ఉండటం లేదు.. అక్కడ నెలకొన్న సమస్యలు ఏమిటి.. ఇంకేమైనా సదు పాయాలు కల్పించాలా.. అన్న ఆలోచన కూడా అధికారు లు చేయడంలేదు. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నా టిడ్కోప్రాంగ ణాల్లోని సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.

భయం.. భయం

తెనాలి సమీపంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో ప్రాంగణంలో ఇటీవల ఓ గృహంలో విష సర్పం ప్రవేశించి గృహిణిని కాటు వేసింది. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కాటు వేసిన ప్రాంతం నుంచి విషం పైకి పాకకుండా తాడుతో కట్టుకట్టుకుని భర్త సాయంతో దాదాపుగా 6 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్న పరిస్థితి. ఈ పరిణామంతో ఇక్కడ లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో నివాసానికి సాహసించడంలేదు. ఇదే పరిస్థితి గృహ ప్రవేశాలు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ నెలకొంది. అపరిశుభ్రత కారణంగా దోమలతో ప్రజలు పగలు కూడా అల్లాడి పోతున్నారు. గుంటూరు అడవితక్కెళ్లపాడులో గత వైసీపీ ప్రభుత్వం కల్పించిన విద్యుత్ సదుపాయాలు నాసిరకంగా ఉండటంతో భూగర్భంలోని వైర్లు తెగి ప్రాణాంతకంగా మారుతుండటంతో మంటలు రేగి ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో లబ్ధిదారులు భయం భయంగా ఉంటున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని దొండపాడులోని టిడ్కో ప్రాంగణం చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.



తెనాలి టిడ్కో గృహాల్లో పాము కాటుకు గురైన మహిళ

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాల్లో పేదల అద్దె ఇళ్ల కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపల్ కేంద్రాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగి గృహ ప్రవేశాలకు సిద్ధమవగా 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల ఆశలు ఆవిరైపోయాయి. కళ్లెదుట ఇళ్లు కనిపిస్తున్నా వాటిని వైసీపీ పాలకులు 2024 ఎన్నికల ముందు వరకు పాడుపెట్టారు. లబ్ధిదారులు, ప్రతిపక్షాలు ఎన్ని ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్ల గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయరన్న ఉద్దేశంతో హడావిడిగా టిడ్కో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. దీంతో 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా, సీఆర్డీఏ సహా 12 పట్టణాల్లో 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 22,068 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే పెండింగ్



రేపల్లెలో టిడ్కో గృహాల దుస్థితి

పనులు చేపట్టకుండా రంగులు వేసి ఇళ్ల తాళాలను నాడు వైసీపీ హయాంలో అప్పగించారు. గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేట, మంగళగిరి, సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లల్లో చేరారు. అయితే తాము చేరిన ఇళ్లు రంగులు మయంగా కనిపిస్తున్నాయే కానీ అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, అపరిశుభ్రత, రవాణా సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఆయా ఇళ్లల్లో ఉండలేక గత ఏడాదిన్నరకు పైగా లబ్ధిదారులు అల్లాడుతున్నారు. గృహప్రవేశాలతో బాధ్యత ముగిసిందన్నట్లు నాడు వైసీపీ హయాంలో అధికారులు వ్యవహరించగా నేడూ అదే తీరు ఈ ప్రభుత్వంలోనూ నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా, చెత్తాచెదారాల తొలగింపు లేక, అత్యవసరమైతే వైద్యం, పిల్లల చదువులకు పాఠశాలలు, రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూస్తున్నా పది నెలలుగా (మిగతా 6వ పేజీలో)



గుంటూరులోని టిడ్కో ఇళ్లపై నిర్మించిన నీళ్ల ట్యాంకులు

అధికారులు సరఫరా చేస్తున్న మురుగు నీరు..

గుంటూరులో గంటే.. అదీ మురుగునీరు

గుంటూరు అడవితక్కెళ్లపాడులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందక అల్లాడుతున్నారు. 4,192 కుటుంబాలకు రోజుకు ఒక్క గంట మాత్రమే నీరు వదులుతున్నారు. పదహారు ప్లాట్లకు ఒక నీళ్ల ట్యాంకు నిర్మించగా, 6 అడుగుల లోతులో ఉండే ఆ ట్యాంకుల్లో రెండడుగులకు మించి నిండటంలేదు. ఆ నీరు కూడా ఉపయోగించుకోవడానికి వీలుగా లేకుండా మురికిగా వస్తున్నాయి. దీంతో ప్రజలు దగ్గరలోని స్వర్ణభారతినగర్‌కు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.

సమస్యలు ఇలా..

- డ్రెయినేజ్‌ల నిర్వహణాలోపంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి సమస్యగా మారింది.
- రేషన్ సరుకులు అందించేందుకు ఎండీయూ వాహనాలు సైతం రాని పరిస్థితి.
- పారిశుధ్య పనులు చేసే సిబ్బంది కూడా నిత్యం రాకపోవడంతో టిడ్కో ప్రాంగణాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది.
- టిడ్కో గృహసముదాయాల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడివినితలపిస్తున్నాయి. దోమలు, విషసర్పాలతో ఆందోళన చెందుతున్నారు.
- నాసిరకం విద్యుత్ వైర్లు కారణంగా ఇళ్లలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంటూరులో అయితే వైర్లు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి.



..జై నారసింహ

- మంగళాద్రిలో వైభవంగా రథోత్సవం
- మార్మోగిన నృసింహ, గోవింద నామస్మరణ
- రథం లాగిన మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

6

నేటి నుంచి ఒంటిపూట బడులు

గుంటూరు (విద్య) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటి పూట బడి నిర్వహించాలని డీఈఓ సీవీ రేణుక శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 7.45 నిముషాల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించాలని అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాల నిర్వహించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా గ్రామపంచాయతీ , వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పాఠశాలలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తరగతులను బహిరంగ ప్రదేశాల్లో , చెట్ల కింద నిర్వహించ రాదని స్పష్టం చేశారు.

ఉగాది తర్వాత నివేశన పట్టాలు



- నిడమర్రు రైల్వేగేటు వద్ద ఓవర్‌బ్రిడ్జి
- మహానాడు ఏరియాలో రిటైనింగ్‌వాల్ నిర్మాణం
- నియోజకవర్గ మంతటా భూగర్భ డ్రైనేజి వ్యవస్థ
- స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు
- మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటా : లోకేష్

మంగళగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పెద్ద మెజారిటీ ఇవ్వండి...మీకు అండగా వుంటానన్న నా విజ్ఞప్తిని మంగళగిరి ప్రజలు ఆలకించి రాష్ట్రస్థాయిలో మూడో అతిపెద్ద మెజారిటీని ఇచ్చారు. నన్ను ఇంతగా దీవించి...నా గౌరవాన్ని నిలబెట్టిన మంగళగిరి ప్రజలకు నేను రుణపడివున్నాను. అందుకే మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖలమంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఎర్రబాలెంలో ఆధునీకరించిన శ్రీ మహవీర్ గోశాలను శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధికి తాను తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మంగళగిరిలో నివేశన స్థలాలు, పట్టాల సమస్య తీవ్రంగా ఉంది. ఉగాది తరువాత మంగళగిరి నియోజకవర్గంలో సుమారు అయిదువేల మందికి నివేశన పట్టాలను పంపిణీ చేయబోతున్నామన్నారు. వివిధ పోరంబోకు భూముల్లో దశాబ్దాల తరబడి స్థిర (మిగతా 5వ పేజీలో)


సబ్సిడీ యంత్రం.. రైతన్నలకు ఊతం

- గుంటూరు జిల్లాకు రూ.2.92 కోట్లు మంజూరు
- వివిధ విభాగాల్లో 1727 యూనిట్లు కేటాయింపు
- రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి
- ఈ నెల 26తో ముగియనున్న గడువు

గుంటూరు సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వ్యవసాయానికి ఎంతో ఉపయోగించే యంత్రాల పంపిణీ కి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం కీలకమైన ఆదేశాలు జారీచేసింది. గుంటూరు జిల్లాలో ని 18 మండలాలకు 1727 యూనిట్లు కేటాయించటం ద్వారా కూటమి ప్రభుత్వం యంత్ర వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచింది. 50 శాతం సబ్సిడీ తో ఆయా యంత్రాలను రైతులకు అందజేయనున్నారు. అందుకు అవసరం అయిన రూ. 2.92 కోట్లను జిల్లా కు కేటాయించారు.

ఏ ఏ యంత్రాలు ఇస్తారు అంటే...

బ్యాటరీ స్ప్రేయర్లు 350, పవర్ స్ప్రేయర్లు 575, ట్రాక్టర్ స్ప్రేయర్లు 7, దుక్కి చేసే యంత్రాలు 720, రోటో వేటర్లు 28, పవర్ వీడర్లు 19, బ్రష్ కట్టర్లు 13, పవర్ ట్రిల్లర్లు 15 చొప్పున మంజూరు అయ్యాయి.



అర్హులు వీరే...

ఈ సంవత్సరం సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు పొందేందుకు సన్న, చిన్న కారు, మహిళా రైతులు మాత్రమే అర్హులు. గత 5 సంవత్సరాలుగా సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు పొందని వారు, చెల్లుబాటు అయ్యే పట్టాదారు పాసుపుస్తకం కలిగి, ఈ-పంటలో పేర్లు నమోదు చేసుకున్న వారు అర్హులు.

యాప్‌లో నమోదు....

ప్రభుత్వం అందించనున్న సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు పొందేందుకు ఆసక్తి కలిగిన రైతులు గ్రామంలో ని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి.అక్కడ ఉన్న వ్యవసాయ సిబ్బంది యాప్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఆ తదుపరి అరు లైన వారికి యంత్రాలను అందజేస్తారు. రైతులు భాగస్వామ్యంగా చెల్లించాల్సిన సొమ్మును కూడా దరఖాస్తు సమయంలో నే చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 26 వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది.

అభివృద్ధి పనులకు.. రూ.25.65 కోట్లు

న్యూగుంటూరు స్టేషన్‌లో సిగ్నలింగ్, టెలికం వర్కులు

వేమూరులో గూడ్స్ షెడ్, కృష్ణాకెనాల్-మంగళగరి మధ్య పైపులైను

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు రైల్వే శాఖ టెండర్లు పిలిచింది. ఆయా పనులకు రూ.25.65 కోట్లు కేటాయించగా త్వరలోనే ప్రారంభించబోతుంది. వేమూరు రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌షెడ్డు ఏర్పాటు కానున్నది. న్యూగుంటూరు రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలకు తలెత్తుతున్న ప్రతిబంధకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ అభివృద్ధి చేయనున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కృష్ణాకెనాల్ - గుంటూరు వాటర్ పైపులైను పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర ప్రాంతాల్లోని రైతులకు వారి పంట ఉత్పత్తులు రవాణాకు సరైన సదుపాయాలు లేవు. తెనాలి రైల్వేస్టేషన్‌కు/రోడ్డు మార్గంలో రవాణా చేసుకోవాల్సి వస్తున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు గుంటూరు రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైల్వే శాఖ వేమూరు క్రాసింగ్ రైల్వేస్టేషన్‌లో ఒక గూడ్స్ షెడ్డుని అభివృద్ధి చేయాలని నిర్ణయించి రూ.9.98 కోట్ల కేటాయించింది. కృష్ణానది నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వరకు పదేళ్ల క్రితమే మంజూరైన తాగునీటి పైపులైను పనులు పెండింగ్లట ఉన్నాయి. ఈ క్రమంలో కృష్ణానది వంతెనపై ఓపెన్ వెబ్ గర్డర్ నిర్మాణానికి రూ.2.97 కోట్లు మంజూరు చేయడంతో రైల్వే శాఖ టెండర్లను పిలిచింది. గుంటూరు - న్యూగుంటూరు/రెడ్డిపాలెం మధ్య టవర్ కార్ రాకపోకలకు, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్డు 4, 5 లైన్ల నుంచి తెనాలి వైపునకు గూడ్స్ రైళ్ల రాకపోకలకు వీలుగా అవసరమైన సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ చేపట్టడానికి రూ.12.7 కోట్ల అంచనాతో టెండర్ల ప్రక్రియని రైల్వే శాఖ చేపట్టింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (శనివారం)
సహరి : 4.59 (ఆదివారం)


సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం./కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పింఛన్ల బదిలీకి ఛాన్స్!

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల బదిలీకి అవకాశమిచ్చిన ప్రభుత్వం
● సచివాలయాల్లో బదిలీ దరఖాస్తు చేసుకునే సదుపాయం

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వలంటీర్లు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించడంతో మొదలైన ఈ సంస్కరణల ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రతినెలా ఏదో ఒక సంస్కరణతో పింఛనుదారుల్లో భరోసాపెంచేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తాజాగా పింఛన్లను తమకు నచ్చినచోటికి మార్చుకునేలా అవకాశం కల్పించింది. దీంతో ఈ అవకాశంకోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది పింఛనుదారులకు ఊరట లభించినట్లయింది.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 7లక్షల 53వేల 830మంది పింఛన్లు పొందుతున్నారు. వారిలో చాలామంది గతంలో తాము ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం నివసించడం లేదు. వయోవృద్ధులు బిడ్డల పై ఆధారపడి వేరేచోటకి వెళ్లిపోవడం, చూసేవా రులేక ఆశ్రమాల్లో ఆశ్రయం పొందడం, ఒంటరి మహిళలు, వితంతువులు బతుకుదెరువు కోసం ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లాల్సిరావడం వంటి పలు కారణాలతో వేరే ప్రాంతాలకు వెళ్లినవారు చెప్పుకోదగిన సంఖ్యలోనే ఉన్నారు. వీరంతా పింఛన్లను బదిలీ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సమీపంలోని సచివాలయాలకు వెళ్లి నిరాశగా వెనుతిరుగుతున్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో ఇప్పటి వరకూ ఫ్రీజింగ్‌లో ఉన్న పింఛన్ బదిలీ ఆప్షన్ అనేబుల్ చేసింది. దీంతో పింఛన్ల బదిలీకి అవకాశం లభించింది. పింఛన్ల బదిలీ కోరుకునే లబ్ధిదారులు ప్రస్తుతం వారు నివసిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ల బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు నాటికీ ఈ ప్రక్రియను పూర్తిచేసుకుంటే ఏ ప్రిల్ 1నుంచి లబ్దిదారులు ఉండేచోటికే పింఛన్లు తెచ్చి అందిస్తారు.

కొత్త పింఛన్లపై నిరాశే..

కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను మొత్తం పెరగడంతో అనేక మంది కొత్తగా పింఛన్లు పెట్టుకోవాలని భావిస్తున్నారు. గత వైసీపీ సర్కారు కక్షాపూరిత రాజకీయాల వల్ల కూడా అనేకమంది పింఛనుదారులు అనర్హత బారిన పడ్డారు. వారంతా గత ఎనిమిది నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లకు అవకాశం కల్పించాలని అలాంటివారంతా ప్రజాప్రతినిధుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి ఎమ్మెల్యేకి వచ్చే విజ్ఞప్తుల్లో 70 శాతం పింఛనుకు సంబంధించిన విజ్ఞప్తులే ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతా వారంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

పిన్నెల్లిపై.. చర్చకు సిద్ధమా..?

● జగన్మోహనరెడ్డికి యరపతినేని పిలుపు



పిడుగురాళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, మోర్జంపాడుతో పాటు పలుగ్రామాలలో టీడీపీ శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసంపై పిన్నెల్లి గ్రామం వేదికగా చర్చకు రావాలని పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆహ్వానించారు. గత ఐదేళ్ల అనేక గ్రామాలలో అరాచకాలకు పాల్పడి మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టిన వైసీపీ నేతలు కొందరు జగన్‌ను కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాపై దాడులు జరుగుతున్నాయని, ఊర్ల నుండి వెలివేస్తున్నారని చెప్పడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని యరపతినేని పేర్కొన్నారు. జగన్‌కు వైసీపీ నేతలు చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, అన్నివిషయాలు వెలుగులోకి రావాలంటే జగనే పిన్నెల్లికి రావాలని యరపతినేని పిలుపునిచ్చారు. జగన్ ఎప్పుడు వచ్చినా చర్చకు సిద్ధంగా ఉన్నానని, జగన్ హాజరై ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన అకృత్యాలు, అక్రమాలపై అక్కడే సమాధానం చెప్పాలని యరపతినేని డిమాండ్ చేశారు. 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు ఒక్క వైసీపీ కార్యకర్త కూడా గురజాల నియోజకవర్గంలో చనిపోలేదని, 2019-24 మధ్య వైసీపీ అధికారంలో వుండగా 11 మంది తెలుగుదేశం కార్యకర్తలు హత్యకు గురికావడమే కాకుండా వైసీపీ నేతలు అక్రమమైనింగ్ చేస్తున్న గుంతల్లో పడి 8 మంది చిన్నారులు మృతి చెందిన విషయమే కాకుండా వైసీపీ నేతలు మహిళలపైచేసిన అత్యాచారాలు, ఆక్రమించుకున్న భూములతో బ్యాంక్‌ల రుణాలు, విచ్చలవిడిగా గ్రామాలలో తెలంగాణ మద్యం అమ్మకాలు, పిన్నెల్లి, తంగెడ గ్రామాలలో నాటు బాంబుల తయారీ విషయాలపై జగన్‌తో చర్చావేదిక జరిపేందుకు సిద్ధంగా వున్నానని, వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాల విషయాలను బయట ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కృష్ణానది గర్భాన్ని కూడా వదలకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడటమే కాకుండా తుమ్మలచెరువు, పెదగార్లపాడు, గుత్తికొండలో మైనర్ బాలికలపై అఘాయిత్యాలు, పిడుగురాళ్లలో బీసీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం, తుమ్మలచెరువు సైదాపై జరిపిన దాడిపై చర్చకు జగన్ సిద్ధమేనా అని ప్రశ్నించారు. జగన్ పిన్నెల్లి ఎప్పుడు వచ్చినా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన నిర్వాకం, అక్రమాలు చర్చా వేదికలో బయటపెడతామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దాడులను ప్రోత్సహించలేదని, నాయకులను, కార్యకర్తలను కూడా సంయమనం పాటించాలని సూచించడం జరిగిందన్నారు.త్వరలో పిన్నెల్లిలోని అఘాయిత్యాలపై విచారణ జరిపిస్తామన్నారు. ఎన్నికల రోజున తంగెడ, పిన్నెల్లిలో బాంబుల ఘటనపై కూడా విచారణ జరిపేలా చూస్తామని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

గుండెపోటుతో జర్మనీలో గణపవరం యువకుడు మృతి


అశోక్‌చంద్రకుమార్ (ఫైల్‌ఫోటో)

నాదెండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన కాట్రు అశోక్‌చంద్ర కుమార్ (46) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జర్మనీ దేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వెంకట చలపతిరావు కుమారుడైన అశోక్‌చంద్ర కుమార్ లండన్‌లో మైక్రోబయాలజీలో పీజీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పొన్నూరు సమీపంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన శిరీషను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కంపెనీ తరపున కొద్దికాలం క్రితం జర్మనీ వెళ్ళిన ఆయన ఈనెల 7వ తేదీన ఉద్యోగానికి వెళ్తుండగా కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడు. స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహం శనివారం ఉదయానికి గణపవరం రానున్నది. ఆయన మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుంటూరు కెనాల్‌లో కాలు జారిపడి విద్యార్థి మృతి


దాసరి జాషువా (ఫైల్‌ఫోటో)

పెదకాకాని, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలుజారి గుంటూరు చానల్‌లో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన శుక్రవారం నంబూరులో జరిగింది. అదే గ్రామానికి చెందిన దాసరి జాషువా(13) స్థానిక జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి రంగులు పూసుకొని ఆటలాడారు. ఒంటిపై రంగును కడుక్కునేందుకు స్నేహితులతో కలిసి గుంటూరు చానల్ వద్దకు వచ్చాడు. రంగులు కడుక్కుంటున్న క్రమంలో కాలుజారి చానల్‌లో పడిపోయాడు. వెంటనే పక్కనున్న పిల్లలు స్థానికులకు సమాచారం ఇవ్వగా గుంటూరు చానల్ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.

16, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 16, 17 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 08579 విశాఖపట్టణం-చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.20కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరునటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా రాత్రి 10 గంటలకు విశాఖ పట్టణం చేరు కొంటుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్రవారం నాటికి 520.30 అడుగులు ఉంది. ఇది 149.82 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,761 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

గుండెపోటుతో రైతు మృతి

కారంపూడి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన రైతు బొజ్జ వెంకటేశ్వర్లు (69) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామ శివారులోని నాలుగు ఎకరాల భూమిని గత మూడు తరాలుగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఆ భూమిలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. వందల యేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ప్రభుత్వ అధికారులు బోర్డు పెట్టడంతో గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. తాము సాగు చేసుకుంటున్న భూమికి తమకే పట్టాలివ్వాలంటూ వినతిపత్రం అందించారు. ఇంతలో కొందరు ఆ భూమిని దేవదాయ శాఖలో కలుపుకోవాలని అధికార యంత్రాంగానికి సిఫార్సులు అందిస్తున్నారు. గ్రామంలో రాజకీయ ఒత్తిడి పెరిగిపోతోంది. తరతరాల నుంచి వస్తున్న సాగుభూమి పోతుందేమోనని, జీవనం కష్టతరమవుతుందనే ఆలోచనతో గత నాలుగు రోజుల నుంచి దిగులుతో ఉన్న వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు వెంకటేశ్వర్లుకు నలుగురు సంతానం ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులతో ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తాం

- తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్
- 40 మందికి రూ.50 లక్షలు విలువైన చెక్కులు అందజేత

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం పాలైన నిరుపేదలకు తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ అండగా నిలుస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం 40 మంది బాధితులకు ఎమ్మెల్యే నసీర్ రూ.50 లక్షలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద దిక్కుగా మారుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 103 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సుమారు కోటి రూపాయలకుపైగా సహాయం అందించామని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తెలిపారు. కేవలం 9 నెలల కాలంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రి రూపురేఖలు మార్చేశామని, అనేక వైద్య సేవలు మెరుగుపరిచామని చెప్పారు. పేదల వైద్యానికి బడ్జెట్లో అధిక ప్రాధాన్యమిచ్చామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా టీఎన్‌యూఎస్ పని చేయాలి

- టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ తాళ్ళ వెంకటేష్‌యాదవ్

గుంటూరు(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్ని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నిర్వర్తించాలని తెలుగుదేశం పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ తాళ్ళ వెంకటేష్ యాదవ్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో శుక్రవారం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం, విశ్రాంత ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంతోపాటు నూతన ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డీఎస్సీ విడుదల చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్వీ జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి, ఉపాధ్యక్షుడు జీవీ శ్రీధర్, గౌరవ సలహాదారు కె.ఫణిదత్తు, మొక్కపాటి రాంబాబు, హెచ్.రామ కోటేశ్వరరావు, కె.మహేష్‌బాబు, కె.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎస్ఆర్‌కే ప్రసాద్, పూదోట హృదయరాజు తదితరులను వెంకటేశ్ యాదవ్ సత్కరించారు.



ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న తాళ్ళ వెంకటేశ్‌యాదవ్ తదితరులు

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

- భాష్యం చైర్మన్ రామకృష్ణ

గుంటూరు (విద్య) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. స్థానిక భాష్యం గోరంట్ల టెన్త్ క్యాంపస్‌లో చైర్మన్ రామకృష్ణ శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అరబిక్ ప్రొఫెసర్ మహ్మద్ ఇషాక్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ రామకృష్ణ చేతులమీదుగా ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వల్ల వారితో సమానంగా అల్లాహ్ నుండి పుణ్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం మేనేజింగ్ డైరక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ వడ్డిస్తున్న భాష్యం రామకృష్ణ, హనుమంతరావు

ఎస్సీ వర్గీకరణలో జిల్లా యూనిట్ విధానంపై పునరాలోచించాలి

- మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అములుకు ప్రభుత్వం జిల్లా ప్రాతిపదికన ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇది ఆర్టికల్ 371డి కి పూర్తిగా విరుద్ధమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా యూనిట్ అమలు చేస్తే న్యాయ సమస్యలు వస్తాయని, తద్వారా మాదిగల పోరాటం వృథా అవుతుందని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించి, న్యాయ నిపుణుల సలహా తీసుకొని సరైన దిశగా అడుగులు వేయాలని కోరారు. తెలంగాణలో మాదిరిగానే ఏపీలో కూడా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. వర్గీకరణపై వైసీపీ తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. తన గురించి మాట్లాడే స్థాయి వైసీపీ నేత కనకారావు మాదిగకు లేదన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తనను మోసం చేశాడని, జగన్, సజ్జల ఉచ్చులో ఎవరూ పడొద్దు అని సూచించారు. సమావేశంలో బీజేపీ, జనసేన నాయకులు దర్శనపు శ్రీనివాస్, పాలకాయల వెంకట్, మాదిగ నాయకులు బెజవాడ ప్రభాకర్, వినుకొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు వద్ద బ్రాందీ షాపు పెట్టొద్దని ఆందోళన



నందివెలుగు రోడ్డులో ఆందోళన చేస్తున్న స్థానికులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని మణి హోటల్ సెంటర్ సమీపంలో మసీదు వద్ద బ్రాందీ షాపు పెట్టొద్దని స్థానికులు ఆందోళనకు దిగారు. బ్రాందీ షాప్ ఏర్పాటు చేస్తున్నందుకు నిరసనగా శుక్రవారం స్థానికులంతా నందివెలుగు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఒక పర్యాయం ఇలాగే బ్రాందీ షాపు పెడుతుంటే తామంత అడ్డుకున్నామని, అప్పుడు షాప్ ఏర్పాటు నిర్ణయాన్ని మార్చుకున్నారన్నారు. తిరిగి మరల ఎందుకు బ్రాందీ షాప్ ఇక్కడ పెడుతున్నారని స్థానికులు ప్రశ్నించారు. పాత గుంటూరు పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సుమారు మూడు గంటల పాటు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. బ్రాందీ షాపు ఏర్పాటు నిర్ణయాన్ని మార్చుకోవటంతో ఆందోళనకారులు విరమించారు.

తాగునీరు అందించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు



టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద పరిశీలన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయాల్లో నివాసం ఉంటున్న వారికి తాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసీ, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులపై ప్రజల తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో సముదాయాల్లో తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డీఈఈలు శ్రీనివాస్, సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోజువారి వేతనంపై కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి : కమిషనర్


నగరంలో పారిశుధ్య పనులు చేయడానికి రోజువారీ వేతనంపై కార్మికులు అవసరమని, ఆసక్తి కలిగిన వారు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌లో నేరుగా లేదా 0863-2345103కి కాల్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా చెత్త తరలించడానికి 15 రోజులకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు అవసర మని, ఆసక్తి కలిగిన ట్రాక్టర్ యజమానులు నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే డివిజన్లలో మైక్రో ప్యాకెట్స్ వారీగా కార్మికులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, ఉత్తర్వుల మేరకు కేటాయించిన వార్డుల్లోనే కార్మికులు విధులు నిర్వహించాలన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కాలేజి సీజ్

జీఎంసీకి ఆస్తి పన్ను చెల్లించని జీవీఆర్ఎస్ ఇంజనీరింగ్ కళాశాలను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు శుక్రవారం తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలో ఆస్తి పన్ను చెల్లించని సంస్థల సీజ్, ట్యాప్ కనెక్షన్ల తొలగింపు కొనసాగుతున్నాయి. బుడంపాడులోని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కాలేజి 2021 నుంచి బకాయి ఉన్న రూ.27,44,695 చెల్లించని కారణంగా రెవెన్యూ అధికారులు సీజ్ చేసినట్టు చెప్పారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తుల సీజ్, ట్యాప్ కనెక్షన్ల తొలగింపు కొనసాగుతుందన్న నగర కమిషనర్ పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

- రూ.16 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ, తెనాలి డీఎస్పీ జనార్దనరావు, వెనుక నిందితులు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అవసరమైన డబ్బుల కోసం చైన్ స్నాచింగ్స్, దొంగతనాలు తదితర నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యులు గల ముఠాను తెనాలి త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. చినరావూరుతోట శ్మశానం బజారుకు చెందిన పోతార్లంక సాయి మాధవ్ అలియాస్ సాయి (21), చినరావూరు తోట గీతాంజలి స్కూల్ రోడ్డుకు చెందిన షేక్ మగ్బుల్ (35), కొల్లిపర మండలం అన్నవరం గ్రామానికి చెందిన అమర్తలూరు నాని (19), చినరావూరు తోట స్మశానం బజారుకు చెందిన మహమ్మద్ సమీర్ (26), అదే ప్రాంతంలోని ఏజీకే స్కూల్ వెనుక రోడ్డుకు చెందిన ధనావత్ హనుమంత్ నాయక్ (19), అదే ప్రాంతంలోని ఎన్టీఆర్ నగర్కు చెందిన సయ్యద్ కరిముల్లా అలియాస్ మున్నా (41), చినరావూరు తోట ప్రాంతానికి చెందిన షేక్ బారావలి అలియాస్ బారా (29) అనే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 16 లక్షల 12 వేల ఖరీదైన 162 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు.

జనవరి 27న తెనాలికి చెందిన ఓ మహిళ చెంచుపేట బ్రిడ్జి వద్ద ఆటో దిగి బ్రిడ్జి కిందగా నడుచుకుంటూ వెళ్తుండగా మెడలో చైన్ తెంచుకొని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీని పై బాధితురాలు తెనాలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తెనాలి రూరల్‌స్టేషన్ ఎస్ఐ ప్రతాప్, కానిస్టేబుల్ వాకా రవి ఇచ్చిన సమాచారం మేరకు తెనాలి రమేష్ బాబు ఆధ్వర్యంలో చినరావూరితోట ప్రాంతానికి చెందిన పోతార్లంక సాయి మాధవ్ అలియాస్ సాయి ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా మాధవ్‌తో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ముఠా వేమూరు నియోజకవర్గ పరిధిలోని చావలిలో చైన్‌స్నా చింగ్‌కు పాల్పడింది. సీసీ కెమెరాల ద్వారా ఈ ముఠాలోని పోతార్లంక సాయి మాధవ్ ను పోలీసులు గుర్తించారు. ఈ ముఠా తెనాలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, చావలిలో మరొకటి ఐదు చైన్‌స్నాచింగ్ నేరాలకు, అదేవిధంగా ఓ దొంగతనానికి పాల్పడ్డారు. అదేవిధంగా తెనాలి త్రీటౌన్ , చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కో ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. వీరిలో హనుమంత్ నాయక్‌పై గతంలో ద్విచక్రవాహం చోరీ చేసిన కేసు ఉంది. హనుమంతు నాయక్ మినహా మిగిలిన ఆరుగురిపై ఇంతవరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

కేసులు ఛేదించిన అధికారులు, సిబ్బందికి రివార్డులు

పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న ముఠాను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు. సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ పర్యవేక్షణలో తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు నేతృత్వంలో తెనాలి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు ప్రకాష్‌రావు, కరిముల్లా, కానిస్టేబుళ్లు పి.మురళి, కె బాబురావు, ఎస్ జైకర్, ఎన్ శ్రీనివాసరావు, డి సురేష్ బాబు, ఏ అనిల్ తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.



ప్రదర్శనలో సంప్రదాయ వస్త్రాలు

ఉగాదికి సంప్రదాయ వస్త్రాల ఎక్స్‌పో

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రానున్న ఉగాది పండుగను పురస్కరించుకుని విస్తృత శ్రేణిలో సంప్రదాయ వస్త్రాల ప్రదర్శన స్థానిక రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్ కన్వెన్షన్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ది హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్, సేల్ ఎక్స్ పో ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు మూడు రోజుల పాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల సంప్రదాయ దుస్తులను, ఫ్యాషన్ వస్త్రాలను, అనేక రకాల ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. పట్టుచీరలు, కాటన్ వస్త్రాలు, సల్వార్‌లు, టాప్స్ వంటి వాటితో సహా అనేక రకాల సంప్రదాయ వస్త్రాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, కలంకారి చీరలు, సాంప్రదాయ కోల్‌కతా, భాగల్‌పూరి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్ చీరలు, బనారస్ పట్టు చీరలు మాత్రమే కాక మగ్గాల పైన నేసిన, రంగులు వేసిన, ముద్రించిన, ఎంబ్రాయిడరీ చేసిన విశిష్టమైన వస్త్రాలు అన్నీ ఒకేచోట అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయతను ఇష్టపడేవారి కోసం పోచంపల్లి, వేంకటగిరి, ఉప్పాడ పట్టు చీరలు కాటన్ చీరలు, అలాగే బంగారం, వెండితో తయారైన కాంచీపురం పట్టు చీరలు ఈ ప్రదర్శనలో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో చీరలు మాత్రమేకాక బెడ్‌స్ప్రెడ్‌లను, రాజస్థాన్ వారి పలు రంగుల తలపాగాలు, పురుషులకు కాటన్ షర్టులు కూడా అందుబాటులో ఉన్నాయి. మూడు రోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరిగే ఎక్స్‌పోలో అన్నిరకాల డెబిట్, క్రెడిట్ కార్డులు కూడా స్వీకరించనుననట్లు చెప్పారు.

రైతుల భూములను దేవదాయ పరిధి నుంచి మినహాయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు, మేడికొండూరు, పెదకాకాని మండలాలకు చెందిన చమళ్లమూడి, జంగంగుంటపాలెం, నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసుకునే భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో సీపీఐ- రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో వచ్చిన ఎండోమెంట్ చట్టం ప్రకారం వారి భూములను ఎండోమెంట్ పరిధిలోకి వస్తుందని ఆన్‌లైన్‌లో ఎక్కించారని తెలిపారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు కొల్లి రంగారెడ్డి పచ్చల శివాజీ, పి.జగన్నాథం కంజుల విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో నంది అవార్డుల ప్రక్రియను ప్రారంభించాలి

- ప్రముఖ సినీ దర్శకుడు దిలీప్ రాజా

గుంటూరు(తూర్పు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల పేరుమార్చి గద్దర్ పేరుతో అవార్డుల ప్రదానానికి ఇప్పటికే దరఖాస్తులు కోరగా ఆంధ్రాలో నంది అవార్డుల ఊసేలేదని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. గుంటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2013 నుంచి నిలిపివేసిన నంది అవార్డుల ప్రదానానికి విధి విధానాలను ప్రభుత్వం రూపొందించాలని కోరారు. నంది అవార్డుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా ఉండాలంటే కమిటీలో సభ్యులుగా రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులతో కమిటీ వేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్ పదవిని తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్న సినిమాలకు రాయి తీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దర్శకులు నరేష్ దోనె, మణివరన్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో వీడిన మిస్టరీ

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కోటి రూపాయల ఖరీదైన బంగారు ఆభరణాల చోరీ కేసులో మిస్టరీ వీడింది. ఈ భారీ చోరీ ఘటనలో ఇంటి దొంగ హస్తం ఉన్నట్లు తేలింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్ 3/6లోని శ్రీనివాస్ అపార్ట్మెంట్స్‌లో సిద్దాబత్తుని చంద్రమోహన్ పట్నంబజార్లో శానిటరీ సామాన్ల షాపు నిర్వహిస్తుంటాడు. ఈనెల 6న చంద్రమోహన్ దంపతులు, కుమార్తె హైదరాబాదు వెళ్లారు. ఆ రోజు మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మాస్కు ధరించి చంద్రమోహన్ ఇంట్లో సుమారు కోటి రూపాయల విలువ చేసే కేజీకి పైగా బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఇంటి తాళాలు పగలకొట్టకుండానే పట్ట పగలు అపార్ట్మెంట్లో చోరీ జరగడం తీవ్ర కలకలం రేపింది. సీసీ కెమెరా పుటేజ్ ఆధారంగా చోరీ చేసిన వ్యక్తి ఆనవాళ్లను పసిగట్టారు. చోరీ అనంతరం నిందితుడు కాకినాడ వెళ్ళిపోయాడు. పోలీసులు కాకినాడ వెళ్లి వాకబ్ చేయగా నిందితుడి పేరు శివగా గుర్తించారు. ఆ సమయంలో అతను లేకపోవడంతో తండ్రిని అదుపులోకి తీసుకొని గుంటూరు తీసుకొచ్చారు. దీంతో శివ చోరీ చేసిన బంగారు ఆభరణాలను పార్శిల్ చేసి మరో అజ్ఞాత వ్యక్తి ద్వారా గుంటూరులోని చంద్రమోహన్ ఇంటికి చేర్చాడు. ఆయా ఆభరణాలన్నీ పరిశీలించగా సుమారు 60 గ్రాములు తగ్గినట్లు గుర్తించారు. మిగిలిన 60 గ్రాముల బంగారు ఆభరణాలను కూడా నిందితుడి చెల్లెలు శుక్రవారం తీసుకొచ్చి పోలీసులకు అప్పగించింది. కాగా కాకినాడలో నిందితుడు శివ పై గతంలో పలు కేసులు ఉన్నట్లు తెలిసింది. సంచలనం సృష్టించిన చోరీ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు.

కారు ఈఎంఐ చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై కేసు

కారు ఈఎంఐ చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనగర్‌కి చెందిన సిద్దాబత్తిని వెంకటేష్ తన కారుని 2023 నవంబర్ నెలలో అతనిస్నేహితుడి బంధువు అయిన నూరి శ్రీరామచంద్రమూర్తికి వాడుకోవటానికి ఇచ్చాడు. మిగిలిన ఈఎంఐలు అతనే కట్టుకొనేటట్లు ఒప్పందం చేసుకున్నారు. కానీ సదరు మూర్తి కారు ఈఎంఐలు కట్టడం లేదని, కారు తిరిగి ఇవ్వటం లేదని, ఉద్దేశపూర్వకంగా మోసగించినట్లు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిసాయి. చివరి రోజున మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విశ్వక్సేరాధన, పుణ్యాహవచనం, బలిహరణ, నిత్య హోమం, మంత్ర హోమం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లెపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించి పలురకాల హోమ ద్రవ్యాలతో పూర్ణాహుతి చేశారు. అనంతరం వేల సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాహితీవేత్త నోరి కోదండరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. హంపి శ్రీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతిస్వామి భక్తుల ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త వంకాయలపాటి బలరామకృష్ణయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్యామలానగర్, రవీంద్రనగర్, సాయినగర్, స్తంభాలగరువు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలానే చెట్ల కొమ్మలు తొలగించటంలో భాగంగా అశోక్‌నగర్, దేవాపురం 5వ లైను ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

ఉగాది తరువాత నివేశన పట్టాలు

(3వ పేజీ తరువాయి)

నివాసముంటున్న వారికి ఈ పట్టాలను అందిస్తున్నాం. శుక్రవారం ఇప్పటంలో ఒకరికి నివేశన పట్టాను పంపిణీ చేస్తూ, ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విడతల వారీగా ఈ పట్టాల పంపిణీ ఉంటుంది. తాడేపల్లి రైల్వే భూముల్లో వుంటున్న వారి సమస్యను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి కూడ తీసుకువెళ్లాం. రైల్వే భూములను క్రమబద్ధీకరించాలన్న తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే గృహాలు, నివేశన స్థలాలు లేనివారిని గుర్తించి వారికి జీ ప్లస్ త్రీ విధానంలో పక్కా గృహాలను నిర్మించి ఇస్తామన్నారు.

రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు

నిడమర్రు రోడ్డులో వున్న రైల్వేగేటు సమస్య కూడ తన దృష్టికి వచ్చిందని..అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలన్న నగర ప్రజల చిరకాల వాంఛను కూడ త్వరలోనే తీర్చబోతున్నామని చెప్పారు. ఈ సమస్యపై కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ పెమ్మసాని బాగా చొరవ చూపారంటూ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తాడేపల్లి సీతానగరం ఏరియానుంచి కనకదుర్గా వారధి వరకు మహానాడు ప్రాంతవాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇందుకుగాను రూ 280 కోట్ల మేర నిధులను మంజూరు చేశామని...దానికి సంబంధించిన డిజైన్‌లు ఖరారు కావల్సి వుందన్నారు. ఇంకో ప్రధానమైన భూగర్భ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన పనులను కూడ రెండుమూడు మాసాలలో ఆరంభించబోతున్నామన్నారు. దీంతోపాటే అండర్ వాటర్ పైప్‌లైను, గ్యాస్, పవర్‌లైన్లను కూడ పనిలోపనిగా ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రస్తుతం టెండర్ల దశలో వున్నాయని లోకేశ్ చెప్పారు. కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ కింద మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి ఆలయాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేయబోతున్నామన్నారు. వారణాసిలో చేపట్టిన కాశీ కారిడార్ స్ఫూర్తిగా నృసింహస్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలోని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు ఆడిటోరియం నిర్మాణాన్ని కూడ చేపడుతున్నామని వివరించారు. నియోజకవర్గంలో పార్కులతోపాటు అన్నీరకాల శ్మశానాలను కూడ అత్యంత సుందరంగా అభివృద్ధి చేసే ప్రణాళికను చేపట్టామన్నారు.

త్వరలోనే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు

ఎన్నికల ముందు మంగళగిరిలోని స్వర్ణకారవృత్తిదారులకు ఇచ్చిన హామీల మేరకు నగరంలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కును ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేయబోతున్నామని లోకేశ్ చెప్పారు. ఈ పార్కు ఏర్పాటుకు సంబంధించిన భూములను కూడ ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం పార్కు డిజైనింగ్ వర్కు జరుగుతుందన్నారు. స్వర్ణకారులకోసం ప్రత్యేకంగా ఓ కార్పొరేషన్‌ను కూడ ఏర్పాటుచేసి బడ్జెట్‌లో దానికి నిధులను కూడ ఇచ్చామని వివరించారు.

ట్రాఫిక్ రద్దీ పరిష్కారానికి చర్యలు

మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య కొంత జటిలంగానే వుందంటూ దీనిని రాగల ఏడాదిలోగా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్డుతోపాటు ఈ-11, ఈ-13 రోడ్లను జాతీయరహదారి-16కి అనుసంధానం చేసిన తరువాత మంగళగిరిపై ట్రాఫిక్ ఒత్తిడి కొంతమేర తగ్గుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ సంస్థతో ఒప్పందం చేసుకుని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ డిజైన్‌కు రూపకల్పన చేయాలనుకుంటున్నామని అన్నారు.

కోల్డ్ స్టోరేజీ బాధితులకు త్వరలో నష్ట పరిహారం : పెమ్మసాని

కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు దుగ్గిరాల కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు రైతులకు రూ 40 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. ఆ బాధిత రైతులకు వచ్చే రెండు మూడు వారాల్లోగా నష్టపరిహారాన్ని అందించబోతున్నామని చెప్పారు. మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి సామర్థ్యాన్ని 60 శాతం నుంచి వంద శాతానికి పెంచుతున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య పాల్గొన్నారు.



మాణిక్యవేల్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి

మానవతావాది మాణిక్యవేల్ మృతి బాధాకరం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఎక్స్ అధినేత అరుణాచల్ మాణిక్యవేల్ లాంటి మానవతావాది మృతి అత్యంత బాధాకరమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. అరండల్‌పేటలోని ఆయన నివాసంలో మాణిక్యవేల్ పార్థివదేహాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మాణిక్యవేల్ తమిళనాడు నుంచి గుంటూరు వచ్చి చిన్నగా వ్యాపారం ప్రారంభించి అంచెలు అంచెలుగా ఎదిగి పెద్ద సంస్థను స్థాపించి గుంటూరులో వేలాదిమందికి ఉపాధిని కల్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా నిలిచిన మాణిక్యవేల్ మృతి తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవల్లి, ముత్తినేని రాజేష్, మర్రిపాటి శ్రీను, సానం రమేష్, ఎం.గణపతి పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి పటిష్ట బందోబస్తు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాజధానిలో శనివారం జరగనున్న శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బందోబస్తు ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేసి, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గాని, ట్రాఫిక్ సమస్యలు గానీ తలెత్తకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు నిర్వహించాలని సూచించారు.





విద్యార్థికి పాఠశాల స్థాయిలో అత్యంత కీలకమైన దశ పదవ తరగతి. ఈ పరీక్షల్లో సాధించే మార్కుల ఆధారంగానే భవిష్యత్తులో ఉన్నత విద్యా అవకాశాలకు బీజం పడుతుంది. ఈ నెల 17 నుంచి 31 తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులను గూర్చి జిల్లా విద్యాశాఖ విద్యార్థులకు తగు సూచనలను, సలహాలను అందిస్తోంది..



- భయం వీడితే... సగం విజయం సాధించినట్లే
- సెల్ ఫోన్లు ,టీవీలకు విరామం ఇవ్వండి
- జంక్ ఫుడ్ జోలికి వెళ్లొద్దు.. సాత్విక ఆహారమే మేలు
- పాఠ్యాంశాల నిత్య పునఃచరణ ఎంతో కీలకం
- పది విద్యార్థులకు విద్యాశాఖ సూచనలు

జయమ్ము... నిశ్చయమ్మురా..

గుంటూరు విద్య, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే విద్యాశాఖ వందరోజుల ప్రణాళికతో పాటు ఇటీవల గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహించింది. ఇందులో వచ్చిన మార్పులు ఆధారంగా విద్యార్థుల్ని మరింతగా ప్రోత్సహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఒక ప్రణాళికతో చదివితే పదిలో ఉత్తమ మార్కులు సాధించవచ్చునని డీఈఓ సీవీ రేణుక రేణుక స్పష్టం చేస్తున్నారు.

ఆరోగ్యం... ఆత్మవిశ్వాసం

పరీక్షల సమయంలో విద్యార్థి ఆరోగ్యం పటిష్టంగా ఉండటం ఎంతో ముఖ్యం. కొంతమంది విద్యార్థులు పరీక్షలు అంటేనే తీవ్రమైన ఆందోళనకు గురవుతుంటారు. అటువంటి వారిని గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పించేలా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. మరి కొంతమంది నిద్రాహారాలు మాని పరీక్షలకు సన్నద్ధం అవుతుంటారు . ఇది ఏ మాత్రం సరైన పద్ధతి కాదని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పునఃచరణ ఉదయం నాలుగు గంటల నుంచి ప్రారంభించి 6 గంటల వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు ప్రణాళిక ప్రకారం సబ్జెక్టుల వారీగా చేసుకోవాలి. ఏకదాటిన కాకుండా కనీసం గంటకు ఒకసారి మధ్య మధ్యలో కొంత విరామం ఇస్తూ చదువుకోవాలి. రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్ర అవసరం.

ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. జంక్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్, మాంసాహారం జోలికి పరీక్షలు పూర్తి అయ్యేవరకు వెళ్లకపోవడం ఉత్తమం. కొబ్బరి నీళ్ల ,మజ్జిగ, గ్లూకోజ్, వేసవి లో లభించే చెరుకు రసం, బత్తాయి రసం, పుచ్చకాయలు వంటి పండ్ల రసాలు, పానీయాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకోవచ్చు.

వీటిని దూరం పెట్టండి....

- విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్లు టీవీల్లో వచ్చే క్రికెట్, సినిమాలు, సీరియల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.
- సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి .
- ఏకాగ్రత దెబ్బతినకుండా మానసిక స్థిరత్వంతో పరీక్షలకు సన్నద్ధం అవ్వాలి.
- పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు తాము చదువుకున్న పాఠ్యాంశాల నుంచే వస్తాయనే విషయం విస్మరించకూడదు.
- అనవసరమైన విషయాలు, వివాదాల జోలికి వెళ్ళకూడదు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలి.





సమర్థంగా సన్నద్ధం ..

ఇటీవల నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ మార్కులకు దీటుగా మరింత సమర్థంగా పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థులని సిద్ధం చేస్తున్నట్లు డీఈవో సివి రేణుక తెలిపారు. విద్యార్థులు పరీక్షల భయం వీడితే సగం విజయం సాధించినట్లేనని తెలిపారు. రోజుకు కనీసం ఏడు గంటలు ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు.

- సీవీ రేణుక,
డీఈవో
గుంటూరు



హోలీ వేడుకల్లో యువత సందడి

హోలీ... ఆనందాల కేళి

గుంటూరు(తూర్పు), మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన ఈ విజయం... నేల నలుదిక్కులా వ్యాపించిన వసంత విలాసం.. అందరి వదనాల్లో ఆనందాన్ని చిలికించింది. ఆ సంతోషమే ఏడు రంగుల ఇంద్ర ధనస్సులా విరిసి వర్ణాల వెల్లువై కళ్లలో మెరుపు.. బుగ్గల్లో ఎరుపు.. నవ్వుల్లో భావాల వర్ణాలన్ని ఉవ్వెత్తున ఎగసి ఆనందం కింతల వేళ.. హోలీ సంబరం అంబరాన్నంటింది. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిళ్లన్నీ కేలింతల్లో కరిగిపోగా.. మనసులోని బాధలన్నీ రంగులలో కలిసిపోయి మధుర క్షణాలను మిగిలిచ్చింది. శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, యువకులు, వృద్ధులు అందరూ కలిసి రంగు రబ్బా రబ్బా అంటూ చిందేశారు. పేద, ధనిక అందరూ ఏకమై హోలీ రంగేళి అంటూ ఆడిపాడారు. రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా చేసుకున్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం

- వెంకటపాలెంలో ఏర్పాట్లు పూర్తి
- 27 వేల మంది తిలకించేలా ఏర్పాట్లు
- భక్తుల కోసం 300 బస్సులు



వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్

తుళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఆలయ ఆవరణలో కల్యాణ వేదిక కళాత్మకంగా తీర్చిదిద్దారు. భక్తులు కూర్చునే గ్యాలరీలు సిద్ధం చేశారు. ఈ మేరకు టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువుగా కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా బస్సులు ఏర్పాటుచేశారు. విజయవాడ నుండి వచ్చేవారి కోసం మందడంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణానికి దాదాపు 4 టన్నుల పూలు, 30వేల కట్ ఫ్లవర్స్ సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి ఆకులు, కొబ్బరి తోరణాలతో సుందరంగా అలంకరించారు. శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6.15 గంటలకు అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారి కల్యాణాన్ని ప్రారంభిస్తారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కల్యాణ అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేయనున్నారు. శ్రీనివాస కల్యాణవేదిక ప్రాంగణం ప్రాంతంలో 5వేల ఫ్లడ్ లైట్‌లు, 25 జనరేటర్లు, 18 ఎల్ఈడీ స్క్రీన్, దశావతారాల శ్రీవేంకటేశ్వరుడు, పద్మావతి అమ్మవార్ల కటౌట్‌లు, ఆలయం పరిసరాలలో 60 తోరణాలతో పాటు, వేంకటేశ్వర ఆలయంలో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేఈవో వీ వీరబ్రహ్మం, పలువురు జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామి వారి కల్యాణానికి పూలదండలు సిద్ధం చేస్తున్న దృశ్యం

అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది అశ్రునయనాల మధ్య మాణిక్యవేల్ అంతిమయాత్ర సాగింది. ముందుగా అరండల్‌పేట 10/2వ లైనులోని స్వగృహం నుంచి మాణిక్యవేల్ అంతిమయాత్ర ప్రారంభమైంది. గోరంట్లలోని ఫ్యాక్టరీ వరకు అనంతరం గోరంట్ల ఫ్యాక్టరీ నుంచి అమరావతి రోడ్డు మీదుగా కొరిటెపాడు వరకు అంతిమయాత్ర సాగింది. కొరిటెపాడులోని హిందూ శ్మశానవాటికలో మాణిక్యవేల్ అంత్యక్రియలు పూర్తి చేశారు. అంతకుముందు అరండల్‌పేటలోని నివాసంలో మాణిక్యవేల్ భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యేలు గళ్లా మాధవి (గుంటూరు పశ్చిమ), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు) పలువురు ప్రముఖులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు.



మాణిక్యవేల్ అంతిమయాత్రకు హాజరైన కుటుంబ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు

ప్రయోగాత్మక సాగు.. లాభాలు బాగు

- మొక్కజొన్న సాగులో ఆశించిన ఫలితాలు
- టన్ను రూ.22,500కు కొనుగోలు చేసిన సంస్థ
- ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి

కొల్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా సాగు చేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగులో టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ ఆశించిన ఫలితాలు సాధించారు. కొల్లూరులో 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ రబీలో ఆయన పాప్‌కార్న్ మొక్కజొన్న సాగును చేపట్టారు. నూజివీడు కు చెందిన సంస్థ వారు ఎకరాకు సరిపడా విత్తనాలను కేవలం రూ.వెయ్యికే అందజేశారు. 92 రోజుల కాలపరిమితి రకం కావడంతో ఆయన అధిక విస్తీర్ణంలో పాప్‌కార్న్ వేశా రు. ఇతర రకాల కాలపరిమితి 120 రోజులు ఉండటంతో పైగా పంట చేతికి వచ్చిన అనంతరం నూర్పిడి చేయగా వచ్చిన గింజలను ఆరబెట్టడం వంటి పనులు కూలీలతో చేయించాలని, పాప్‌కార్న్ రకం సాగు చేయడం వల్ల సంస్థ ప్రతినిధులు కండె గింజలు గట్టిపడిన వెంటనే కూలీలతో పంట కోయించి వారే బస్తాలకు నింపుకుని తీసుకు వెళతారని, దీనివల్ల రైతుకు ఎకరాకు రూ.4-5 వేలు ఆదా కావడంతో పాటు శ్రమ కూడా తగ్గుతుందన్నారు. టన్ను రూ.22,500కు సంస్థ వారే కొనుగోలు చేయడం రైతుకి మరింత కలిసివచ్చే విషయమన్నారు. ఈ ప్రాంతంలో తనతో పాటు మరికొంతమంది రైతులు కూడా పాప్‌కార్న్ సాగు చేపట్టారని, మూడు నుంచి మూడున్నర టన్నుల లోపే దిగుబడులు పొందారని తాను మాత్రం ఎకరాకు 4 టన్నులు పైనే దిగుబడి సాధించడం జరిగిందన్నారు. వచ్చే రబీలో పాప్‌కార్న్ రకంతో పాటు మరో నూతన మొక్కజొన్న రకాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసి అత్యధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.



మొక్కజొన్న బస్తాలను లారీకి మారుస్తున్న కూలీలు



ప్రయోగాత్మకంగా సాగుచేసిన పాప్‌కార్న్ మొక్కజొన్న కండెలను చూపుతున్న మురళీకృష్ణ

- మంగళాద్రిలో వైభవంగా రథోత్సవం
- మార్మోగిన నృసింహా, గోవింద నామస్మరణ
- రథం లాగిన మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని

జై నారసింహా



మంగళగిరి, సిటీ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శుక్రవారం మంగళగిరి తిరునాళ్ల ఘనంగా జరిగింది. మంగళగిరి తిరునాళ్లగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీనృసింహస్వామివారి దివ్య రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల నడుమ నేత్రపర్వంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనులతో నగరవీధులు కిక్కిరిసిపోయాయి. రథం బయలుదేరే సమయానికి పరిసర ప్రాంతాలన్నీ జనప్రవాహంతో రద్దీగా మారాయి. నృసింహుని మహారథోత్సవం ఆనవాయితీ ప్రకారం శాకున శాస్త్ర విధిని అనుసరించి నిర్వహించారు. ఆలయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉత్సవ మూర్తుల విగ్రహాలను అర్చకస్వాములు తీన్‌మార్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి మహారథంపై అధిష్ఠింపజేశారు. ముందుగా రథయాజ్ఞీకులు రథాంగ హోమం నిర్వహించి అన్నపురాశిని అష్టదిక్కులకు బలిహారణ చేశారు. రథ అధిదేవతా ఆవాహనం గావించారు. గుమ్మడికాయలు, పలు రకాల అలంకరణలతో కాషాయ ధ్వజ శోభితమైన ఈ మహారథానికి ఉత్సవ కైంకర్యపరులు మాడభూషి వేదాంతాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తదితరులు టెంకాయలను కొట్టి రథోత్సవాన్ని ఆరంభించారు. అనంతరం రథయాజ్ఞీకులు రథారూఢులైన శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ నృసింహస్వామివార్లకు హారతినిచ్చి అనుజ్ఞ ఇవ్వగా భక్తులు జై నారసింహ అంటూ భక్తి పారవశ్యంతో మోకును లాగి రథాన్ని బయలుదేరతీశారు. గాలిగోపురం వద్ద గల రథశాల నుంచి మహారథం మెయిన్ బజారు మీదగా మిద్దె సెంటరు చేరుకుని తిరిగి అదే మార్గంలో రథశాల చేరింది. నృసింహుని రథోత్సవంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. జై నారసింహ, గోవింద నామస్మరణల మధ్య భక్తులతో కలిసి ఉత్సాహంగా రథం మోకును లోకేశ్ లాగారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేశ్

ఇళ్లు సరే.. సౌకర్యాలు?

(3వ పేజీ తరువాయి)

వీరి గోడు పట్టించుకున్న వారే లేరు.

- చిలకలూరిపేట చెరువురోడ్డులో 52 ఎకరాల్లో టిడ్కో సముదాయంలో వసతులు లేని కారణంగా 4,612 గృహాలకు రెండువేల మంది కూడా నివాసం ఉండడం లేదు. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. వీధి దీపాలు, నీటి వసతి కల్పించింది. ఆస్పత్రి, పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.
- సీఆర్డీఏ పరిధిలో కృష్ణయ్యపాలెంలో టిడ్కో ఇళ్లకు వెళ్లేందుకు అప్రోచ్‌రోడ్డు లేదు. కంకరతో తాత్కాలిక రోడ్డు వేసి సరిపెట్టారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇక్కడ తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరుతోంది. దొండపాడులో మందుబాబులు, జూదరుల దాడులతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఇళ్లు ఇవ్వాలి.. ఊసేలేని పనులు

రాజధాని అమరావతి పరిధిలోని 8 ప్రాంతాల్లో 5,024 ఇళ్లు, గుంటూరు సమీపంలోని అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888, పొన్నూరులో 2,368, తెనాలిలో ఫేజ్- 1లో 848, మంగళగిరిలో 1,728, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 4,512, నరసరావుపేటలో 1,504, ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. కాగా వెంగళాయపాలెంలో ఫేజ్- 2 కింద 1,392, సత్తెనపల్లిలో 160 ఇళ్లు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయి. తెనాలిలో ఫేజ్- 2లో 1,008, చిలకలూరిపేటలో ఫేజ్- 2లో 1,008 ఇళ్లు, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056, ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అద్దంకిలో 863 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్ల ఎలాంటి పనులూ జరగలేదు. రేపల్లె మండలం అరవపల్లి సమీపం, రేపల్లెలోని రెండో వార్డులో 1373 టిడ్కో ఇళ్లు మంజూరైనా పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ఐదేళ్ల పాడుబెట్టడంతో టిడ్కో ప్రాంగణం చుట్టూ భారీఎత్తున పిచ్చి మొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి పిడుగురాళ్లలో సుమారు 4 వేలకు పైగా టిడ్కో గృహాలు మంజూరు కాగా 2018 నాటికి 2,832 గృహాల్లో సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ గృహప్రవేశాలకు ముందుకు రాలేదు. సత్తెనపల్లిలోని భీమవరం డొంక రోడ్డులో 160 వరకు గృహాలను నిర్మించగా విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం కూడా జరగాల్సి ఉంది. మాచర్లలో 1056 టిడ్కో గృహాల పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మందుబాబులకు నిలయాలుగా మార్చుకున్నారు. వైసీపీ పాడుపెట్టిన ఇళ్లతో పాటు గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఇళ్లను చంద్రబాబు అందిస్తారని లబ్ధిదారులు పది నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూడా టిడ్కో ఇళ్లపై హామీలు ఇచ్చి ఉన్నారు. అయితే ఇప్పటి వరకు టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



మాచర్ల పట్టణంలోని టిడ్కో గృహాలు



సత్తెనపల్లిలోని భీమవరం రోడ్డులో ఉన్న టిడ్కో గృహాలు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రత్తిపాడు, మార్చి, 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు విచ్చేయనున్నట్లు తెలిపారు.

సీబీఎన్‌పై పోస్టు.. కేసు నమోదు

దుగ్గిరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుముఖంపై చెప్పుపెట్టిన ఫోటోను షేర్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గుంటూరు జిల్లా దుగ్గిరాల ఎస్‌ఐ వెంకట రవి శుక్రవారం తెలిపారు. ఈ విషయమై దుగ్గిరాల తెలుగుయువత అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ తొలుత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టిన సదరు వ్యక్తి ఫేస్‌బుక్ ఐడీ ఆధారంగా కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరాడు. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్ట్‌లో పలు అంశాలున్నాయని, పరువుకు భంగం కలిగించేలా అభ్యంతరకర పోస్ట్‌పెట్టిన తెలంగాణాకు చెందిన రావు జనార్ధన్ అనే వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ మహేష్ తన ఫిర్యాదులో కోరాడు. దాంతో పోలీసులు పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ(నిడుముక్కల)మార్చి 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమార్కులకు అడ్డుఅదుపులేకుండా పోతుంది. రేషన్ బియ్యాన్ని సేకరించి ఏవరికి అనుమానం రాకుండా ఖాళీ ప్రదేశాల్లో రేషన్ బియ్యంను నిల్వ చేసి దొంగచాటుగా విక్రయిస్తున్నారు. గురువారం రాత్రి తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని దర్గా ఎదురుగా ఉన్న ప్లాట్లలో 16 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉన్నారు. రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సివిల్ సప్లై అధికారులకు సమాచారం రావటంతో సంఘటన స్థలానికి చేరుకొని బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక రేషన్ డీలర్‌కు అప్పగించారు.

పశ్చిమ డెల్టా కాల్వకు నీరు

దుగ్గిరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1316 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 76 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 110 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 98 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 133 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 68 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 746 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గుణదల పుణ్యక్షేత్రానికి కాలినడకన యాత్ర

మంగళగిరి సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తపస్సుకాల శ్రమ దినాలలో భాగంగా చినకాకాని ఆర్సీఎం చర్చి విచారణ గురువులు, విచారణ పరిధిలోని కాజ, వెనిగండ్ల గ్రామాలకు చెందిన క్రైస్తవులు శుక్రవారం విజయవాడలోని గుణదల మాత పుణ్యక్షేత్రానికి కాలినడకన పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. విచారణ గురువులు ఫాదర్ అల్లం చిన్నపరెడ్డి, మూడు గ్రామాలకు చెందిన ఉపదేశులు, సంఘ పెద్దలు, 600 మందికి పైగా క్రైస్తవ భక్తులు తరలివెళ్లారు. గత ఐదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు భోజనం, తాగునీటి వసతిని కల్పించారు.

కృష్ణ మందిరంలో పూజలు

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఉండవల్లిలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా చైతన్య మహాప్రభువుగా అవతరించి కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనను ప్రబోధించిన చైతన్య మహా ప్రభువు ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా శ్యామసుందర మందిరంలో తెల్లవారుజామున మంగళ హారతితో శంకాభిషేకం, కీర్తనలు, భజనలు, ప్రవచనములు, నగర సంకీర్తన, ఇస్కాన్ యూత్‌చే సంకీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు శ్రీమాన్ చక్రధర దాస, శ్రీమాన్ సేవ్యా భగవాన్ దాస, తాడేపల్లి మంగళగిరి విజయవాడ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

నృసింహునికి గరుడోత్సవం

మంగళగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి శుక్రవారం ఉదయం బంగారు గరుడోత్సవం నిర్వహించారు. నూతన వధూవరులైన శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం చేశారు. దేవస్థానం మాడవీధుల్లో విహరించిన అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం సాగింది. ఈ ఉత్సవానికి శేకూరు గ్రామానికి చెందిన వాసిరెడ్డి సీతారామయ్య కుమారులు వాసిరెడ్డి జయదత్తు, ప్రభునాథ్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం

మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గణపతినగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.అనూష ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

గోసంరక్షణ అందరి బాధ్యత : మంత్రి లోకేశ్




గోవులకు గ్రాసాన్ని తినిపిస్తున్న మంత్రి లోకేశ్, భగవాన్ మహవీర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరిస్తున్న లోకేశ్

మంగళగిరి, మార్చి 14 (ఆంధ్ర.జ్యోతి): గోసేవ చేస్తే దేవునికి సేవ చేసినట్టే.. కనిపించే దైవమే గోమాత... గోసంరక్షణ అనేది మనందరి బాధ్యతని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎర్రబాలెం పారిశ్రామికవాడలో ఆధునీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, ఇతర నూతన సముదాయాలను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహకులు గోశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భగవాన్ మహవీర్ విగ్రహంతో పాటు గోపాలమూర్తి విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ గోశాల నిర్వహకులైన జైన్ సోదరులను ఆయన అభినందించారు. రెండు ఆవులతో 25 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఈ గోశాల ప్రస్తుతం 450 ఆవులను పోషిస్తుందన్నారు. ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జైన్ సోదరులకు తాను ఎల్లవేళలా అండదండగా వుంటానని చెప్పారు. మంగళగిరిలో ఆవులన్నీ చాలవరకు రోడ్లపైనే తిరుగాడుతుండడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటని గోశాలలకు తరలించాలని అనుకుంటున్నట్టు చెప్పారు. గోసంరక్షణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలనుకుంటున్న కారణంగానే ఎర్రబాలెంలో గోశాలలు వున్నప్పటికీ తాను లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మరో గోశాలను ఏర్పాటుచేయించానని చెప్పారు. ఆవు పాలు చాల శ్రేష్టమైనవని...శ్రీ భగవాన్ మహవీర్ గోశాల ఆధ్వర్యంలో కొతత్తగా మరో రెండు గోశాలలను ప్రారంభించడం తనకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కేవలం గోసంరక్షణకు కృషి చేద్దామని మాటగా చెప్పడం కన్నా దానిని ఆచరణలో పెట్టి చూపించడం అభినందనీయమన్నారు. గోకులాలు, గోశాలలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో జైనులు బాగా ముందుంటారని...సేవ అనేది వారి రక్తంలోనే వుంటుందని లోకేశ్ చెప్పారు. జైనులకు తాను అన్నీ వేళలా అండగా వుంటానని...వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావచ్చునని ఈ సందర్భంగా హమీనిచ్చారు. ఈ సందర్భంగా గోశాల నిర్వహకులు మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య, ఆకుల ఉమామహేశ్వరరావు, చావలి ఉల్లయ్య, తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది తర్వాత నివేశన పట్టాలు

(3వ పేజీ తరువాయి)

నివాసముంటున్న వారికి ఈ పట్టాలను అందిస్తున్నాం. శుక్రవారం ఇప్పటంలో ఒకరికి నివేశన పట్టాను పంపిణీ చేస్తూ, ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విడతల వారీగా ఈ పట్టాల పంపిణీ ఉంటుంది. తాడేపల్లి రైల్వేభూముల్లో వుంటున్న వారి సమస్యను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కేంద్ర రైల్వేశాఖమంత్రి ఆశ్వనీ వైష్ణవ్ దృష్టికి కూడ తీసుకువెళ్లాం. రైల్వే భూములను క్రమబద్ధీకరించాలన్న తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే గృహాలు, నివేశన స్థలాలు లేనివారిని గుర్తించి వారికి జీ ప్లస్ త్రీ విధానంలో పక్కా గృహాలను నిర్మించి ఇస్తామన్నారు.

రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు

నిడమర్రు రోడ్డులో వున్న రైల్వేగేటు సమస్య కూడ తన దృష్టికి వచ్చిందని...అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలన్న నగర ప్రజల చిరకాల వాంఛను కూడ త్వరలోనే తీర్చబోతున్నామని చెప్పారు. ఈ సమస్యపై కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ పెమ్మసాని బాగా చొరవ చూపారంటూ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తాడేపల్లి సీతానగరం ఏరియానుంచి కనకదుర్గా వారధి వరకు మహానాడు ప్రాంతవాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇందుకుగాను రూ 280 కోట్ల మేర నిధులను మంజూరు చేశామని...దానికి సంబంధించిన డిజైన్‌లు ఖరారు కావల్సి వుందన్నారు. ఇంకో ప్రధానమైన భూగర్భ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన పనులను కూడ రెండుమూడు మాసాలలో ఆరంభించబోతున్నామన్నారు. దీంతోపాటే అండర్ వాటర్ పైప్‌లైను, గ్యాస్, పవర్‌లైన్లను కూడ పనిలోపనిగా ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రస్తుతం టెండర్ల దశలో వున్నాయని లోకేశ్ చెప్పారు. కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ కింద మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి ఆలయాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేయబోతున్నామన్నారు. వారణాసిలో చేపట్టిన కాశీ కారిడార్ స్ఫూర్తిగా నృసింహస్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలోని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు ఆడిటోరియం నిర్మాణాన్ని కూడ చేపడుతున్నామని వివరించారు. నియోజకవర్గంలో పార్కులతోపాటు అన్నీరకాల శ్మశానాలను కూడ అత్యంత సుందరంగా అభివృద్ధి చేసే ప్రణాళికను చేపట్టామన్నారు.

త్వరలోనే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు

ఎన్నికల ముందు మంగళగిరిలోని స్వర్ణకారవృత్తిదారులకు ఇచ్చిన హమీల మేరకు నగరంలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కును ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేయబోతున్నామని లోకేశ్ చెప్పారు. ఈ పార్కు ఏర్పాటుకు సంబంధించిన భూములను కూడ ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం పార్కు డిజైనింగ్ వర్కు జరుగుతుందన్నారు. స్వర్ణకారులకోసం ప్రత్యేకంగా ఓ కార్పోరేషన్‌ను కూడ ఏర్పాటుచేసి బడ్జెట్‌లో దానికి నిధులను కూడ ఇచ్చామని వివరించారు.

ట్రాఫిక్ రద్దీ పరిష్కారానికి చర్యలు

మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య కొంత జటిలంగానే వుందంటూ దీనిని రాగల ఏడాదిలోగా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హమీనిచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్డుతోపాటు ఈ-11, ఈ-13 రోడ్లను జాతీయరహదారి-16కి అనుసంధానం చేసిన తరువాత మంగళగిరిపై ట్రాఫిక్ ఒత్తిడి కొంతమేర తగ్గుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ సంస్థతో ఒప్పందం చేసుకుని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ డిజైన్‌కు రూపకల్పన చేయాలనుకుంటున్నామని అన్నారు.

కోల్డ్ స్టోరేజీ బాధితులకు త్వరలో నష్ట పరిహారం : పెమ్మసాని

కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు దుగ్గిరాల కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు రైతులకు రూ 40 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. ఆ బాధిత రైతులకు వచ్చే రెండు మూడు వారాల్లోగా నష్టపరిహారాన్ని అందించబోతున్నామని చెప్పారు. అలాగే మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి సామర్థ్యాన్ని 60 శాతం నుంచి వందశాతానికి పెంచుతున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య పాల్గొన్నారు.

శ్రీనివాసుని కల్యాణం చూద్దాం రారండి

● రాజధాని గ్రామాలలో ఇంటింటికి ఆహ్వాన పత్రికలు పంపిణీ



తుళ్లూరులో ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది

తుళ్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) వెంకటపాలెం శ్రీనివాసుని కల్యాణం చూద్దాం రారండి.. అంటూ, రాజధాని గ్రామాలలో కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను అధికారులు ప్రజాప్రతినిధులు ఇంటింటికి తిరిగి రెండు రోజుల నుంచి పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 15 శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8.30 వరకు వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి కళ్యాణం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సీఎం చంద్రబాబు కళ్యాణానికి హాజరవుతారని టీటీడీ తెలిపింది. రాజధాని గ్రామాల నుంచి కల్యాణానికి వచ్చే భక్తుల కోసం 300 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసింది. వచ్చే భక్తులకు స్వామి వారి లడ్డు, అన్న ప్రసాదాలను అందజేయటానికి ఏర్పాట్లు చేశారు.

నృసింహుని సేవలో స్వచ్ఛంద సంస్థలు



మార్కెట్ సెంటరులో ప్రసాదం పంపిణీ చేస్తున్న దాతలు

మంగళగిరి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నృసింహస్వామి కల్యాణం, రథోత్సవం, తిరునాళ్ల సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, భక్త బృందాలు, దాతలు భక్తుల సేవలో తరించాయి. అడుగడుగునా భక్తులకు పలు రకాల తీర్థప్రసాదాలు, పండ్లు, తాగునీరు, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మాజేటి సూర్య వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు నృసింహాలయ ప్రాంగణంలో వేలాది మందికి తీర్థప్రసాదాలను అందజేశారు. సేవారత్న మునగపాటి హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మునగపాటి పూర్ణచంద్రరావు, ప్రసన్న వెంకటేశ్వరరావు, తారక రామాంజనేయులు, నాగరాజు, సీతారామాంజనేయులు, దివి వెంకటేశ్వరరావు, కొల్లి శివశంకర్, బట్టు శివశంకర్ తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు, బిస్కెట్ ప్యాకెట్లు, అగరబత్తులు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. శ్రీ పేద అనాథల మాతృసేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుచ్చకాయ ముక్కలు పంచిపెట్టారు. సంఘం అధ్యక్షుడు లింగినేని శ్రీరామమూర్తి, సారబోయిన నాగేశ్వరరావు, చెన్నుబోయిన వెంకట నరసయ్య, యన్నం శివనాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం ప్రజాచైతన్యయాత్రలో స్థానికుల నివేదన

దుగ్గిరాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవనగర్ వాసులు 30 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలకేంద్రం దుగ్గిరాలలోని చెన్నకేశవనగర్‌లో సీపీఎం నాయకులు ప్రజా చైతన్యయాత్రను శుక్రవారం నిర్వహించారు. ప్రజల ఇండ్లకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలనడిగి తెలుసుకున్నారు. 30ఏళ్లుగా తాము మురుగునీటి కాల్వలు లేక దోమల బెడదతో అల్లాడుతున్నామని, మలేరియా, టైపాయిడ్ జ్వరాల బారిన పడుతూ, అనారోగ్యం పాలవుతున్నామని, కుక్కల బెడదతో అల్లాడుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడు లేకపోయారని తన దృష్టికి తీసుకువచ్చారని అప్పారావు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున పోరాటం జరుపుతామన్నారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి జెట్టి బాలరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, గొర్రిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూర్ల రామాంజనేయులు

సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలి

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రం సహకారంతో విద్యుత్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన సోలార్‌ను నియోజకవర్గంలో ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్థానిక నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు ఉచితంగా, బీసీల 80, మిగతా కులాలకు 60 శాతం సబ్సిడీని అందిస్తున్నారని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తాడేపల్లి (గుండిమెడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుండిమెడ గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కెఎల్ డీమ్డ్ యూనివర్సిటి సాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్ తెలిపారు. శుక్రవారం కెఎల్‌యూ విద్యార్థులు గ్రామస్తుల భాగస్వామ్యంతో స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ డొమైన్ గ్రీన్ ఇన్నోవేషన్‌లో భాగంగా జీవ వైవిధ్యాన్ని మెరుగు పరచడంతోపాటు పర్యావరణ ప్రాముఖ్యత పెంచడం కోసం గ్రామంలోని అంగన్‌వాడి పాఠశాల, మైదాన ప్రాంతాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



ఈమని గ్రామంలో సీఎం సహాయనిధి నగదు చెక్కును అందిస్తున్న నాయకులు

జనసేన ఆవిర్భావదినోత్సవ సభకు

పిఠాపురం వెళ్లిన జనసైనికులు

దుగ్గిరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలకు చెందిన జనసైనికులు పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు తరలి వెళ్లారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, పలువురు జనసేన నాయకులు పాల్గొననున్న చిత్రాడ జనసేన విజయోత్సవ సభకు ఈమనిగ్రామం నుంచి మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు నేతృత్వంలో దుగ్గిరాల లాకుల వరకూ ర్యాలీగా వచ్చి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు.

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముట్లూరు గ్రామంలో శుక్రవారం గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన స్థానిక నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ దిమ్మె వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లం రామయ్య, మండల కార్యదర్శి జీ వెంకట్, మండల సంయుక్త కార్యదర్శులు ప్రవీణ్, సాయి, వార్డు సభ్యులు బీ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ వై రాంబాబు, నేతలు తంబి, రంగ, అల్లం చిన్న, బీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు శుక్రవారం మండలం నుంచి జనసేన నేతలు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

పోలీసు స్టేషన్‌కు చేరుకున్న

పదో తరగతి ప్రశ్నపత్రాలు

పెదనందిపాడు, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి 31 వరకు జరగనున్న పదవ తరవగతి పరీక్షల ప్రశ్న పత్రాలు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. ఆ ప్రశ్నపత్రాలను అధికారులు పోలీసుల సమక్షంలో ట్రంకు పెట్టెల్లో పెట్టి సీలు వేసి లాకర్‌లో భద్రపరిచారు. మండలంలోని ఏబీపాలెం, పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు, రెండు పాఠశాలల్లో 315 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎగ్జామ్స్ చీఫ్ కె చంద్రశేకర్, పి వెంకటేవ్వరరావులు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9గంటలకు చేరుకోవాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ అధికారులుగా పున్నారావు, ఆనందరావు, రూట్ ఆఫీసర్‌గా ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, జాకబ్‌లు ఉంటారని తెలిపారు.

ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం

దుగ్గిరాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి తొలిప్రాధాన్యమిస్తోందని టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. మండలంలోని పలురకాల సమస్యలతో వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 8 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, జనసేన పాతఅర్ద మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మరీదు రాము, కొప్పుల మధుబాబు, మన్నం అశోక్, తెలుగురైతు ప్రధానకార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాసరావు, యడ్ల సాయికృష్ణ, కాసరనేని కృష్ణ, చిలువూరు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలి

దుగ్గిరాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం దుగ్గిరాలలోని సుగాలీకాలనీలో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో తయారు చేసిన రంగులను చల్లుకుంటూ యువతీ, యవకులు సండి చేశారు.

సాయి నాధుడి ఆలయ 23వ వార్షికోత్సవం

ఫిరంగిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని వేంచేసి ఉన్న షిరిడీ సాయి నాథ స్వామి, శ్రీ సీతాలాంభ అమ్మవారి 23వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయని ఆలయ పూజారి ఎన్‌వీ నరసింహాచార్యులు తెలిపారు. అలాగే శుక్రవారం ఉదయం 9:30 గంటలకు పరవస్తు హనుమాన్ సూరి సహకారంతో సాయిచాలీసా, హనుమాన్‌చాలీసా నేత్రపర్వంగా శ్రవణానందకరంగా నిర్వహించారు. 15వ తేదీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ స్వామి వారి పూజల్లో పాల్గొనున్నారని కమిటీ తెలిపింది. అలాగే నారాయణం ప్రసాదాచార్యస్వామి, వంశీ కృష్ణమాచార్య స్వాములు పూజలు నిర్వహిస్తారన్నారు. పాలక వర్గ సభ్యులు, గ్రామస్థులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్న సమారాధనలో పాల్గొనాలని ఆయన కోరారు. 15వ తేదీ రాత్రి 9 గంటలకు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

మేడికొండూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పేరేచర్ల గ్రామంలో శుక్రవారం బాలికపై అత్యాచారయత్నం ఘటన చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన దేవరకొండ రామారావు అనే 60 ఏళ్ల వృద్ధుడు తన ఇంటి సమీపంలో ఉండే 12 ఏళ్ల బాలికపై కన్నేశాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. భయపడిన బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు రావడాన్ని గమనించిన రామారావు అక్కడ నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాత్రి 10 గంటల సమయంలో మేడికొండూరు పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. బాలికకు వైద్య పరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన దేవరకొండ రామారావు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

తాడేపల్లి (చిర్రావూరు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లి మండలం చిర్రావూరులో శుక్రవారం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సీఎస్‌ఏ హానర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు - నిర్వహణ అనే అంశంపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని సోలార్ వాటర్ హీటర్, సోలార్ లైట్లు వాడితే విద్యుత్ ఖర్చు తగ్గుతుందని ఏసిని 24-26 డిగ్రీల మధ్య మాత్రమే ఉంచాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఒక యూనిట్ విద్యుత్ పొదుపు ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కంటే గొప్పదని కెఎల్‌యూ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్ సూచించారు.

రెండు గ్రామాల్లో ప్రజాచైతన్యయాత్ర



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెదనందిపాడు, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని, పెదనందిపాడు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీపీఎం నేతలు శుక్రవారం ప్రజాచైతన్య యాత్ర చేపట్టారు. కాలనీ వాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోయ కులానికి చెందిన 60 కుటుంబాలు వరగానిలో ఉన్నాయని, మాకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని, తమ కులాన్ని బీసీ లేదా ఎస్టీ కులాల్లో కలిపే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని కోరారు. మురుగు నీరు పారుదల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో తమ పేర్లు నమోదుకు సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని, గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు లేక ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని వారి దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై సీపీఎం బృందం అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తామని తెలిపారు. లేని పక్షంలో త్వరలో సచివాలయాలు, మండల కార్యాలయాల వద్ద సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం జరుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డొప్పలపూడి రమేష్‌బాబు, కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కృష్ణనగర్ పర్యటనలో భాగంగా ప్రసంగిస్తున్న సీపీఐ నేత కంచర్ల కాశయ్య

తాడేపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇల్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని కృష్ణనగర్, ప్రకాష్ నగర్‌లో సీపీఐ నేతలు పేదల నుండి అర్జీలు స్వీకరించారు. మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కమిషనర్‌కు పేదలు, నేతల సమక్షంలో అర్జీలు అందజేయడం జరుతుందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామంలోని పేదలకు మూడు సెంట్లు ఇంటికి స్థలం కేటాయించి ఇల్లు తామే స్వయంగా నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు బాషా, చిన్నరాజు, నాగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

డాక్టర్ దక్షిణామూర్తికి డాక్టర్ పరుచూరి రాజారామ్ సాహితీ పురస్కారం

గుంటూరు (తూర్పు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సాహితీవేత్త, అరసం నేత డాక్టర్ పరుచూరి రాజారామ్ సాహితీ సత్కారాన్ని ఈ ఏడాది తెనాలికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ దక్షిణామూర్తికి అందజేయనున్నట్లు అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 18న బృందావన్‌గార్డెన్స్ సేవ లైన్, డిస్ట్రిక్ట్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహిస్తారన్నారు. డాక్టర్ దక్షిణామూర్తికి రూ.పది వేలు నగదు, జ్ఞాపికను పరుచూరి రాజారామ్ కుమార్తె పరుచూరి అజిత అందజేస్తారని తెలిపారు.

ఘనంగా హోలీ సంబరాలు




కొల్లిపర, తెనాలిలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న రాజస్థాన్‌కు చెందిన యువతీ, యువకులు, చిన్నారులు

కొల్లిపర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండుగ వేడుకలను శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం వేడుకల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో మార్వాడీ, రాజస్థాన్ చెందిన యువతీ, యువకులు డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుని చిందులు వేస్తూ గ్రామ పురవీధుల్లో సందడి చేశారు. నూతలి కాలనీలో హోలీ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వారసులు పల్లీన ప్రతి ఒక్క కుటుంబం తెల్లవారుజామున హోలీ మంటలను వేసి పండుగ జరుపుకున్నారు.

● తెనాలి అర్బన్: పట్టణంలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

మానవత్వం చాటుకున్న భక్త బృందం

తెనాలి, మారీసుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాజరుపేటలో ఒంటరిగా నివాసముంటున్న నూతలపాటి సుబ్రహ్మణ్యం బాత్‌రూమ్‌లో పడి నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. మృతుడికి ఎవరూ లేకపోవడంతో శ్రీవెంకటేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మిత్రబృందం శుక్రవారం శ్మశానవాటిక తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీలో నంది అవార్డులను ప్రారంభించాలి

● సినీ దర్శకుడు దిలీప్ రాజా

గుంటూరు (తూర్పు) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల పేరుమార్చి గద్దర్ పేరుతో అవార్డుల ప్రదానానికి ఇప్పటికే దరఖాస్తులు కోరగా ఆంధ్రాలో నంది అవార్డుల ఊసేలేదని మాజీ ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. గుంటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2013నుంచి నిలిపివేసిన నంది అవార్డుల ప్రదానానికి విధి విధానాలను ప్రభుత్వం రూపొందించాలని కోరారు. 1964నుంచి యథేచ్ఛగా కొనసాగిన నంది అవార్డులకు 2014లో గ్రహణం పట్టిందన్నారు. సినిమా, టీవీ, నాటక రంగాలకు నంది అవార్డులను ఊగిదికి అందించే సంప్రదాయం గతంలో ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం నంది అవార్డుల ప్రదానానికి ఏపీ ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికులారా ఏకం కావాలని ఆకాంక్షించిన కార్ల్‌మార్క్స్ జీవితం ఆదర్శనీయం అని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. కార్ల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆరేటి రామారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పాలన వలన అనేక మానవతా విలువలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో కళాకారులు రాజబాబు, భరత్, తిరుపతయ్య, రాజు, మస్తాన్‌వలీ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న శ్రీవింధ్యా వాసవీ సమేత నగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు అర్చనలు, హోమాలు, కల్యాణం జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కూడా ఈ మూడు రోజులు నిర్వహిస్తామన్నారు. కమిటీ సభ్యులు విశ్వేశ్వరరావు, అప్పారావు, హరేరామ్, శేషాచలం, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

సువార్తమ్మకు ఘన నివాళి

తెనాలి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఐప్టూ కార్యాలయంలో వేము సువార్తమ్మకు నివాళులర్పించారు. మహిళల అభ్యున్నతి కోసం ఆమె పోరాడారని ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు మాణిక్యాలరావు చెప్పారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె సేవలను గుర్తుచేశారు. కనపర్తి బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సభలను జయప్రదం చేయాలి

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 గుంటూరు కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాచోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పొన్నూరులోని ములుకుదురులో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. రాష్ట్రంలో 70శాతం మంది ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని వారి సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, షేక్ గౌస్, రవీ, జానీ, కోటేశ్వరరావు, నాగలక్ష్మీరా, కలి మల్లు, వెంకటేశ్వరరావు, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

తెనాలి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రాంతీయ ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ఈ నెల 18న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కొటాబుప్రసాద్ కోరారు. 1995లో కేంద్రం తెచ్చిన పెన్షన్ పథకం కార్మికులకు నష్టం తెస్తోందని, కార్మికుల నుంచి మినహాయించే ఈపీఎఫ్‌పై తక్కువ వడ్డీ ఇస్తూ వారి కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నారని చెప్పారు. శివశంకరరావు, రమణ, హుస్సేన్‌వలీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలి

● ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

తెనాలి క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని రేంజ్ డీఎస్ యక్స్ శ్రీనివాసులు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మద్యం దుకాణదారుల సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పల్నాడు ప్రాంతం నాటు సారారహిత ప్రాంతంగా మార్చేందుకు ఎన్ అంశాల విధానాన్ని అమలు జరుపుతున్నట్లు జిల్లాలో కల్లు కల్తీ నిరోధించడానికి తరహా శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడు నెలల్లో మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించని వారిపై 602 కేసులు నమోదుచేసి 359 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది చేసిన దాడుల్లో 558 లీటర్ల లిక్కర్, 8లీటర్ల బీరు, 1466 లీటర్ల నాటుసారా, రెండు కిలోల గంజాయి, ఒక కిలో ఎండీఎంఏతో పాటు ఐదు వాహనాలు సీజ్ చేశామన్నారు. పల్నాడు ప్రాంతంలో 17,750 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. బెల్టు షాపుల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ మూడు నెలల కాలంలో 224 కేసులు నమోదయ్యాయి. 225మందిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. 453 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని మూడు వాహనాలు సీజ్ చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. డిపెన్స్ మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. కల్లుగీత కార్మికులు నిర్వహించే షాపుల్లో 81శాంపిల్స్ సేకరించడం, బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై 96 కేసులు నమోదు చేసి 99 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. వివిధ కేసుల్లో ఇప్పటి వరకు బీఎన్ఎస్ చట్టం మేరకు 542మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. లోక్ అదాలత్‌లో వివిధ కేసుల పరిష్కారం ద్వారా రూ.35లక్షలు ఆదాయం సమకూర్చినట్లు శ్రీనివాసులు పేర్కొన్నారు. సమావేశంలో డీపీఓ అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు, పట్టణ ఎక్సైజ్ సీఐ వెంకటాచలం పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామ నామ పారాయణ పూర్ణాహుతి ఉత్సవాలు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న విద్యారణ్య భారతిస్వామి, హోమం చేస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శతకోటి, శ్రీరామనామ పారాయణ పూర్ణాహుతి మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. తెనాలి తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 9 నుంచి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం విశేష హోమం నిర్వహించారు. హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థాన పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సమాజంలో అడుగంటుతున్న విలువలను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సాటి మనిషిని ఆదుకునేతత్వం పెరగాలని, కుటుంబ బంధాలు మెరుగుపడాలని కోరారు. సాయంత్రం ఉచిత సామూహిక కుంకుమార్చన, పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సహస్రావధాని గరికిపాటి నరసింహారావు రెండో రోజు కూడా ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో కళాశాల ప్రాంగణం కిక్కిరిసింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహా మంత్ర స్థూపం నిర్మించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

ఉగాది తరువాత నివేశన పట్టాలు

(5వ పేజీ తరువాయి)

నివాసముంటున్న వారికి ఈ పట్టాలను అందిస్తున్నామని, శుక్రవారం ఇప్పటిలో ఒకరికి నివేశన పట్టాను పంపిణీ చేస్తూ ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విడతల వారీగా ఈ పట్టాల పంపిణీ ఉంటుంది. తాడేపల్లి రైల్వేభూముల్లో పుంటున్న వారి సమస్యను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి కూడా తీసుకువెళ్తాం. రైల్వే భూముల క్రమబద్ధీకరించాలన్న తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే గృహాలు, నివేశన పట్టాలు లేనివారిని గుర్తించి వారికి జీ ప్లస్ త్రీ విధానంలో పక్కా గృహాలను నిర్మించి ఇస్తామన్నారు.

రూపందం కొట్టతో అభివృద్ధి పనులు

నిడమర్రు రోడ్డులో వున్న రైల్వేగేటు సమస్య కూడా తన దృష్టికి వచ్చిందని..అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలన్న నగర ప్రజల చిరకాల వాంఛను కూడా త్వరలోనే తీర్చబోతున్నామని చెప్పారు. ఈ సమస్యపై కేంద్ర సహాయమంత్రి, ఎంపీ పెమ్మసాని బాగా చొరవ చూపారని ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తాడేపల్లి సీతానగరం ఏరియానుంచి కనకదుర్గ వారధి వరకు మహానాడు ప్రాంతవాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇందుకుగాను రూ 280 కోట్ల మేర నిధులను మంజూరు చేశామని...దానికి సంబంధించిన డిజైన్లు ఐఐటీ కావల్సిఉంద న్నారు. ఇంకో ప్రధానమైన బాగార్పు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన పనులను కూడా రెండు మూడు మాసాలలో ఆరంభించబోతున్నామన్నారు. దీంతోపాటే అండర్ వాటర్ పైప్‌లైను, గ్యాస్, పవర్ లైన్లను కూడా పనిలోపనిగా ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఇప్పటికి ప్రస్తుత టెండర్ దశలో వున్నాయని లోకేశ్ చెప్పారు. కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ కింద మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేయబోతున్నామన్నారు. వారణాసిలో చేపట్టిన కాశీ కారిడార్ స్ఫూర్తిగా నృసింహస్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలోని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు ఆడిటోరియం నిర్మాణాన్ని కూడా చేపడుతున్నామని వివరించారు. నియోజకవర్గంలో పార్కులతోపాటు అన్నిరకాల శ్మశానాలను కూడా అత్యంత సుందరంగా అభివృద్ధి చేసే ప్రణాళికను చేపట్టామన్నారు.

త్వరలోనే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు

ఎన్నికల ముందు మంగళగిరిలోని స్వర్ణకారులతో తాము ఇచ్చిన హామీల మేరకు నగరంలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కును ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేయబోతున్నామని లోకేశ్ చెప్పారు. ఈ పార్కు ఏర్పాటుకు సంబంధించిన భూమును కూడా ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం పార్కు డిజైనింగ్ పర్కు జరుగుతున్నాయన్నారు. స్వర్ణకారులకోసం ప్రత్యేకంగా ఓ కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటుచేసి బడ్జెట్‌లో దానికి నిధులను కూడా ఇవ్వామని వివరించారు.

ట్రాఫిక్ రద్దీ పరిష్కారానికి చర్యలు

మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య కొంత జటిలంగానే వుండటంపై దీని గాను ఏడాదిలోగా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సీడ్ యాక్సిస్‌రోడ్డుతోపాటు ఈ-11, ఈ-13 రోడ్లను జాతీయరహదారి-16కి అనుసంధానం చేసిన తరువాత మంగళగిరిపై ట్రాఫిక్ ఒత్తిడి కొంతమేర తగ్గుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం చేసుకుని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ డిజైన్‌ను రూపకల్పన చేయాలనుకుంటున్నామని అన్నారు.

కోల్డ్‌స్టోరేజీ బాధితులకు త్వరలో నష్ట పరిహారం: పెమ్మసాని


కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు రైతులకు రూ 40 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. ఆ బాధిత రైతులకు వచ్చే రెండు మూడు వారాల్లోగా నష్టపరిహారాన్ని అందించబోతున్నామని చెప్పారు. అలాగే మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి సేవల్లో 60శాతం నుంచి వందశాతానికి పెంచుతున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, ఎ.జయసత్య పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

రూ. 16 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అవసరమైన డబ్బుల కోసం చైన్ స్నాచింగ్స్, దొంగతనాలు తదితర నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను తెనాలి త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. చినరావూరుతోట శ్మశానం బజారుకు చెందిన పోతార్లంక సాయి మాదవ్ అలియాస్ సాయి (21), చినరావూరు తోట గీతాంజలి స్కూల్ రోడ్డుకు చెందిన షేక్ మగ్బుల్ (35), కొల్లిపర మండలం అన్నవరం గ్రామానికి చెందిన అమర్లపూడి నాని (19), చినరావూరు తోట స్మశానం బజారుకు చెందిన మహమ్మద్ సమీర్ (26), అదే ప్రాంతంలోని ఏజీజీ స్కూల్ వెనుక రోడ్డుకు చెందిన ధరావత్ హనుమంత్ నాయక్ (19), అదే ప్రాంతంలోని ఎస్‌సీఆర్ నగరుకు చెందిన సయ్యద్ కరీముల్లా అలియాస్ మున్నా (41), చినరావూరు తోట ప్రాంతానికి చెందిన షేక్ బారావలి అలియాస్ బారా (29) అనే ఏడుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16 లక్షల 12వేల విలువైన 162 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. హనుమంతు నాయక్ మినహా మిగిలిన ఆరుగురిపై ఇంతవరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదు. ఈ ముఠా 2023 జూన్ నుంచి చైన్ స్నాచింగ్ నేరాలు ప్రారంభించింది. వరుస చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతూ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న ముఠాను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరామర్శించారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బావన వేణు, గొడవర్రు గ్రామానికి చెందిన అరుమళ్ల ముక్కోటి, మంచాల గ్రామానికి చెందిన చిమటా సీతారామయ్య, గృహాలకు వెళ్లిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

నేటి నుంచి పొన్నూరు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి పొన్నూరు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై శుక్రవారం అభిలపక్ష రాజకీయ పార్టీలు, వర్తక సంఘాలతో పురపాలక సంఘంలో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం 7:30కు పొన్నూరు పట్టణంలో పురపాలక సంఘ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని, ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొనున్నారని తెలిపారు.

'అజ్ఞానాన్ని తొలగించేందుకు పిరమిడ్ సొసైటీ కృషి'

తెనాలి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంచేలా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ కృషి చేస్తుందని సొసైటీ ప్రతినిధి మునిబాబు చెప్పారు. స్థానిక కొత్తపేటలోని కళ్యాణ మండపంలో శుక్రవారం సొసైటీ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

కన్నుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

తెనాలి, మారీసుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని శ్రీసాలిగ్రామ మఠంలో శ్రీవిద్యాధిరాజ ట్రస్ట్, శ్రీసాలిగ్రామ ట్రస్ట్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షణలో శ్రీనివాసుని కళ్యాణాన్ని కన్నుల పండుగగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి స్వామివారి మాట్లాడుతూ 15వ తేదీన భక్తులతో కలసి తిరుమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

తెనాలిలో ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

తెనాలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులు తెనాలిలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పట్టణంలోని పలు వార్డుల ప్రదర్శన గా వెళ్లారు. గంగానమ్మపేటలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, పలువురు నాయకులతో కలిసి కటేకేక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మార్కెట్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై పిఠాపురంలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభను వీక్షించారు.



మార్కెట్ యార్డులో బలప్రదర్శన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

రైతుల్లో ఉత్సాహం నింపేలా ఎడ్ల పోటీలు

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో ఉత్సాహం, ఆనందం నింపేలా ఎడ్ల బల ప్రదర్శనలు ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వాహక సభ్యులు, కూటమి శ్రేణులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ స్మారక ఎడ్ల బల ప్రదర్శన పోటీలు 7ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. వ్యవసాయంలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సాక్షి భావనారాయణస్వామి ఆలయంలో కొలువుదీరిన రాజ్యలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాజ్యలక్ష్మీదేవి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు వేకువజామున మంత్ర జలాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి విశేష అర్చనలు జరిపారు.

కార్మికుడు మృతి

తెనాలి, మారీసుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నూతన భవనానికి రంగులు వేస్తూ తాడు తెగి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక పాండురంగపేటకు చెందిన సాయికుమార్ (20) భవనాలకు పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. సాయికుమార్ శుక్రవారం చెంచుపేటలో ఒక భవనానికి పెయింట్ వేస్తూ తాడు తెగడంతో కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తొమ్మిది నెలల క్రితమే వివాహం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

రహదారుల నిర్మాణానికి రూ.1.05 కోట్లు మంజూరు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రూ.1.05 కోట్లు మంజూరు చేయించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ చేబ్రోలు మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీనింగ్ మినహా ఛానిక శేకూరు, వీరనాయకునిపాలెం, శలపాడు, వడ్లమూడి, వేజెండ్ల, నారాకోడూరు గ్రామాలలో రహదారులు పూర్తిగా ధ్వంసం అయినట్లు ఆరోపించారు. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వానికి ఆయా గ్రామాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, శలపాడు నీటి సంఘం అధ్యక్షుడు కంచర్ల శేషగిరిరావు, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నవగ్రహ శాంతి హోమం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం నవగ్రహ శాంతి హోమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వైద్య ఖర్చుల రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తుందని సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరమని పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెదపూడి గ్రామానికి చెందిన తన్నీరు శివకోటేశ్వరావుకు రూ.35,600, అలాగే పట్టణంలోని 31వ వార్డుకు చెందిన వెల్లంపల్లి సొమ్ముకు 59,506, అలాగే 26వ వార్డుకు చెందిన మండల శ్రీకృష్ణకు రూ.45,000ల చెక్కులను ఎమ్మెల్యే నివాసంలో చెక్కులను పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

కొల్లిపర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర కృష్ణానది సమీపంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెలంగాణ గ్రామంలో పసుపు బండి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య ఉత్సవ విగ్రహాలను ఆలయం వద్దకు తీసుకు రావడంతో మహిళలు పొంగళ్లు వండి, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అదే విధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, అన్నవరంగొంపాలెం, సిరిపురం గ్రామాల్లో శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య తిరునాళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరావు ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.